# వీఏవోల సమస్యలు పరిష్కరించాలి

మిరుదొడ్డి, మార్చి 24 : అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్ వీఏవోలకు ఇచ్చి న హామీలు నెరవేర్చడంలో పూర్తిగా విఫలమైందని వీఏవోల సంఘం రాష్ట్ర నాయకురాళ్లు యమున, స్వప్న, శోభ ఆరోపించారు. వీఏవోల సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ సోమవారం ఐకేపీ కార్యాలయంలో ఏపీఎం దాకయ్యకు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గ్రామ స్థాయిలో విధులు నిర్వహిస్తున్న వీఏవోలకు ఉద్యోగ భద్రత కల్పించి రూ.20 వేల వేతనం అందించాలన్నారు. ఈ నెల 25వ తేదీన చేపట్టనున్నల చలో హైదరాబాద్ సెర్ప్ ముట్టడి


మిరుదొడ్డిలో ఏపీఎం దాకయ్యకు వినతిపత్రం అందజేస్తున్న వీఏవోలు

కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. వీఏవోలు మహేశ్, లక్ష్మి, కనకయ్య, మహిపాల్, కవిత, లావణ్య, లక్ష్మి పాల్గొన్నారు.

## చలివేంద్రం ప్రారంభం

చేర్యాల, మార్చి 24 : మాజీ మంత్రి నిమ్మ రాజిరెడ్డి జ్ఞాపకార్థం పట్టణంలోని అంగడి బజారులో ఆయన మనువడు నిమ్మ నిఖిల్‌రెడ్డి చలివేంద్రాన్ని ఏర్పాటు చేయడంతో సోమవారం మున్సిపల్ కమిషనర్ చుంచు నాగేందర్ ప్రారంభించారు.ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ వేసవిలో ప్రజల దాహం తీర్చేందుకు చలివేంద్రాలు ఏర్పాటు చేయాలని కోరారు.చలివేంద్రం ఏర్పాటు చేసిన నిఖిల్‌రెడ్డిని అభినందించారు. కార్యక్రమంలో నిమ్మ శ్రీనివాస్‌రెడ్డి, అనిత, మున్సిపల్ సిబ్బంది పాల్గొన్నారు.


చేర్యాలలో చలివేంద్రాన్ని ప్రారంభిస్తున్న మున్సిపల్ కమిషనర్ నాగేందర్

## నిత్యాన్నదానానికి విరాళం

చేర్యాల, మార్చి 24 : కొమురవెల్లి మల్లికార్జున స్వామి క్షేత్రంలో కొనసాగుతున్న శాశ్వత నిత్యాన్నదాన పథకానికి హైదరాబాద్ నగరంలోని దోమలగూడ ప్రాంతానికి చెందిన ఉప్పుల కోటేశ్వర్‌రావు స్వతంత్ర దంపతులు రూ.1,00,116ను విరాళంగా అందజేశారు. సోమవారం ఉప్పుల దంపతులు ఆలయంలో విరాళం అందజేసి రశీదు పొందారు.కార్యక్రమంలో ఆలయ ప్రధానార్చకుడు మహాదేవుని మల్లికార్జున్, సూపరింటెండెంట్ శ్రీరాములు పాల్గొన్నారు.



విరాళం అందజేస్తున్న ఉప్పుల కోటేశ్వర్‌రావుస్వతంత్ర దంపతులు

## లక్ష్మీనర్సింహస్వామి ఆలయ వార్షికోత్సవం

గజ్వేల్, మార్చి 24: మండలంలోని శ్రీగిరిపల్లిలోని లక్ష్మీనర్సింహస్వామి ఆలయ వార్షికోత్సవాన్ని నిర్వాహకులు సోమవారం ఘనంగా నిర్వహించారు. ఉదయం నుంచి ప్రత్యేక పూజలు చేశారు. స్వామివారిని దర్శించుకున్న భక్తులకు అన్నదానం చేశారు. ఈ సందర్భంగా బీఆర్‌ఎస్ గజ్వేల్ నియోజకవర్గ ఇన్‌చార్జి వంటేరు ప్రతాప్‌రెడ్డి స్వామివారిని దర్శించుకొని ప్రత్యేక పూజల్లో పాల్గొన్నారు. మాజీ సర్పంచ్ చెరుకు చంద్రమోహన్‌రెడ్డి, గుంటుక రాజు పాల్గొన్నారు.


స్వామివారిని దర్శించుకున్న ఎఫ్‌డీసీ మాజీ చైర్మన్ వంటేరు ప్రతాప్‌రెడ్డి

## రోడ్డు వేయకుంటే ప్రచారానికి రానివ్వం

చేర్యాల, మార్చి 24 : రోడ్డు వేయకుంటే ఎన్నికల ప్రచారానికి రానివ్వమని మండలంలోని ముస్త్యాల గ్రామంలోని 7వ వార్డుకు చెందిన మహిళలు సోమవారం నిరసన తెలిపారు.ఈ సందర్భంగా లత, భాగ్యమ్మ, పద్మ, మధురమ్మ, భావన, రజిత, దేవేంద్ర, లక్ష్మి, రాజమణి మాట్లాడుతూ తమ వాడకట్టుకు సీసీ రోడ్డు మంజూరైతే కింది వాడకట్టుకు తరలించుకుపోయారని ఆవేదన వ్యక్తం చేశారు. వార్డులోని తమ ప్రాంతానికి రోడ్డు వేయకపోతే ఎన్నిక ప్రచారానికి నాయకులు రాకుండా అడ్డుకుంటామని హెచ్చరించారు. వారితో పాటు పరశురాములు, కనకాచారి ఉన్నారు.


ముస్త్యాలలో నిరసన తెలుపుతున్న మహిళలు

## బాధిత కుటుంబాలను ప్రభుత్వం ఆదుకోవాలి

హుస్నాబాద్‌రూరల్, మార్చి 24: మండలంలోని నాగారంలో ఇటీవల ఐదు రోజుల వ్యవధిలో అనారోగ్యంతో మృతిచెందిన అన్నదమ్ములు పొన్నాల ప్రభాకర్, పొన్నాల రవీందర్ కుటుంబాలను ప్రభుత్వం ఆదుకోవాలని బీఎస్పీ నియోజకవర్గ ఇన్‌చార్జి పచ్చిమట్ల రవీందర్‌గౌడ్ డిమాండ్ చేశారు. సోమవారం ఆయన నాగారంలో బాధిత కుటుంబాలను పరామర్శించి విలేకరులతో మాట్లాడారు. దళిత నిరుపేద కుటుంబాలకు చెందిన వారు అనారోగ్యంతో అకాల మరణం చెందారని, వారి కుటుంబాలకు వేర్వేరుగా రూ.20లక్షలు అందించి పిల్లలకు ఉచిత కార్పొరేషన్ విద్య అందేలా చూడాలని కోరారు. కార్యక్రమంలో వేల్పుల రాజు తదితరులు పాల్గొన్నారు.


బాధిత కుటుంబ సభ్యులతో మాట్లాడుతున్న బీఎస్పీ నాయకులు

# క్షయ నిర్మూలన అందరి బాధ్యత

సిద్దిపేట, మార్చి 24 : క్షయ నిర్మూలన అందరి బాధ్యత అని డీఎంహెచ్‌వో పల్వన్ కుమార్ అన్నారు. సోమవారం జిల్లా కార్యాలయంలో ప్రపంచ క్షయవ్యాధి నివారణ దినోత్సవాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ క్షయ వ్యాధిని నిర్మూలించేందుకు వైద్య సిబ్బంది కృషి చేయాలన్నారు. క్షేత్రస్థాయిలో ప్రజల్లో వ్యాధి నిర్మూలన దిశగా అవగాహన కల్పించాలన్నారు.అనంతరం క్షయ నియంత్రణ అధికారి డాక్టర్ అరుణ్‌కుమార్ మాట్లాడుతూ జిల్లాలో క్షయ వ్యాధి నిర్మూలనలో సాధించిన ప్రగతి గురించి వివరించారు. అనంతరం క్షయ వ్యాధి నిర్మూలనలో ప్రతిభ కనబర్చిన ఉత్తమ ఉద్యోగులకు జ్ఞాపికలు అందజేశారు. కార్యక్రమంలో ప్రోగ్రాం అధికారులు డాక్టర్ అరుణ్‌కుమార్, ఆనంద్, శ్రీకల, ఎన్‌సీడీ డాక్టర్ నారాయణరావు, టీబీ సిబ్బంది, ఆశ కార్యకర్తలు, ఏఎన్‌ఎంలు పాల్గొన్నారు.



చేర్యాల మండలం గుర్జకుంటలో ర్యాలీ నిర్వహిస్తున్న యూత్ సభ్యులు

### టీబీ వ్యాధి పై అవగాహన

చేర్యాల, మార్చి 24 : మండలంలోని గుర్జకుంటలో నెహ్రు యువ కేంద్రం సిద్దిపేట సహకారంతో గుర్జకుంట వివేకానంద వెల్ఫేర్ యూత్ అసోసియేషన్ ఆధ్వర్యంలో టీబీ వ్యాధి పై అవగాహన కల్పించేందుకు సోమవారం ర్యాలీ నిర్వహించారు.ఈ సందర్భంగా యూత్ అధ్యక్షుడు దోమ్మాట రాజు మాట్లాడుతూ ప్రపంచ టీబీ దినోత్సవం సందర్భంగా ర్యాలీ చేపట్టినట్లు తెలిపారు. ఏఎన్‌ఎం కవిత, ఆశ కార్యకర్తలు, యూత్ సభ్యులు పాండు, శ్రీను, కరుణాకర్ పాల్గొన్నారు.

## అనారోగ్యంతో కొమురవెల్లి ఆలయ మాజీ చైర్మన్ మృతి

మద్దూరు(ధూళిమిట్ట), మార్చి24: కొమురవెల్లి ఆలయ మాజీ చైర్మన్ నలుసాని గోపాల్‌రెడ్డి(70) అనారోగ్యంతో బాధపడుతూ సోమవారం రాత్రి మృతి చెందాడు. మద్దూరు మండలంలోని రేబర్తికి చెందిన నలుసాని గోపాల్‌రెడ్డి కొమురవెల్లి ఆలయ చైర్మన్‌గా రెండు సార్లు సేవలందించారు. చేర్యాల ప్రాంత రాజకీయాల్లో గోపాల్‌రెడ్డి తనదైన పాత్ర పోషించారు. గోపాల్‌రెడ్డికి భార్య, కుమారుడు ఉన్నారు. గోపాల్‌రెడ్డి మృతిపై వివిధ రాజకీయ పార్టీల నాయకులు తమ ప్రగాఢ సంతాపాన్ని తెలియజేశారు.


నలుసాని గోపాల్‌రెడ్డి(ఫైల్)



సోమవారం తొగుట పీఎస్‌లో ఆశ వర్కర్లను ముందస్తు అరెస్టు చేసిన పోలీసులు

# ఎండిన ధూళిమిట్ట పెద్దవాగు

- చెక్‌డ్యామ్‌లో కానరాని నీటిచెమ్మ
- బోసిపోతున్న రంగనాయకసాగర్ కాలువ
- నీళ్లు లేక ఎండుతున్న పంటలు


నిండుకుండలా ఉన్న ధూళిమిట్ట చెక్‌డ్యామ్ (ఫైల్)


నీళ్లు లేక వెలవెలబోతున్న చెక్‌డ్యామ్

మద్దూరు(ధూళిమిట్ట), మార్చి 24: సిద్దిపేట జిల్లా ధూళిమిట్ట గ్రామం చుట్టూ పెద్దవాగు విస్తరించి ఉండడంతో గ్రామాన్ని ఓ ద్వీపకల్పంగా పిలిచేవారు. ఊరికి మణిహారంలా ఉన్న పెద్దవాగే ఊరికి ఆదెరువు. వాగు పారితేనే వారికి బతుకుదెరువు. పెద్దవాగు(మోయితుమ్మెద)లోని నీటి బొట్టును ఒడిసి పట్టుకునేందుకు గతంలో వాగుపై చెక్‌డ్యామ్‌లను నిర్మించారు. చెక్‌డ్యామ్‌ల నిర్మాణంతో భూగర్భ జలాలు పెరిగి బోరుబావులు ఎల్లబోసేవి. మూడేండ్ల క్రితం వరకు చెక్‌డ్యామ్‌లు జలకళతో ఉట్టిపడేవి. ఇప్పుడు ఆ పరిస్థితి లేదు. చెక్‌డ్యామ్‌ల్లో చుక్కనీరు లేక బోసిపోయి కనిపిస్తున్నాయి. వాగులో నీళ్లు అడుగంటడంతో బోరుబావుల్లో నీళ్లలేక పంటలు ఎండిపోతున్నాయి. ధూళిమిట్టలో 500 ఎకరాల్లో పంటలు సాగుచేస్తున్నారు. ప్రస్తుతం నీళ్ల లేక గ్రామంలోని పొలాలన్నీ బీటలుపారుతున్నాయి. పంటలను కాపాడుకునేందుకు రైతులు నానాపాట్లు పడుతున్నారు. గ్రామంలోని పెద్ద చెరువు కూడా ఎండిపోవడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. ఇదే పరిస్థితి కొనసాగితే గ్రామంలో తాగేందుకు నీళ్లు దొరికే పరిస్థితి ఉండదని గ్రామస్తులు చెబుతున్నారు.

### వాగులో బోర్లు ఎత్తిపోతున్నాయి



ధూళిమిట్టలో భూగర్భజలాలు మొత్తం అడుగంటినయి. చెక్‌డ్యామ్ ల్లో ఉన్న నీళ్లు లేకుండా పోయినయి. వాగులో కొన్ని బోర్లు ఎత్తిపోతున్నయి. గడ్డమీద బోర్లయితే పూర్తిగా ఎండిపోతున్నాయి. పొలాలు మొత్తం ఎండిపోతున్నయి. ఇంతకుముందు మాకు కాళేశ్వరం నీళ్లు రంగనాయకసాగర్ నుంచి వచ్చేవి. ఇప్పుడు ఆ నీళ్లు రావడం లేదు. ధూళిమిట్ట అంటే బంగారు మిట్ట లెక్క ఉండేది. ఎన్కటి నుంచి కూడా చుట్టుముట్టు ఊర్లకు మా ఊరు ఆదర్శంగా ఉండేది. నీళ్లు లేక పంటలు ఎండిపోతున్నయి. ఎండిన పంటలకు ప్రభుత్వం పరిహారం ఇవ్వాలి.

– తుషాలపురం కనకయ్య, రైతు, ధూళిమిట్ట

### గతంలో రంగనాయకసాగర్ నుంచి నీళ్లు..

2022 ఏప్రిల్‌లో రంగనాయకసాగర్ నుంచి కాల్వల ద్వారా ధూళిమిట్ట పెద్ద చెరువుకు గోదావరి జలాలు వచ్చాయి. గోదావరి జలాలు రావడంతో గ్రామస్తులు హర్షం వ్యక్తం చేస్తూ పూజలు చేశారు. రెండేండ్ల పాటు గోదావరి నీళ్లు రావడంతో చెరువు నిండడమే కాకుండా కాల్వ చుట్టుముట్టు ఉన్న రైతులు తమ పొలాలను పారించుకున్నారు. ప్రస్తుతం నీళ్ల లేక రంగనాయకసాగర్ కాల్వ పిచ్చి మొక్కలు, చెట్లతో దర్శనమిస్తున్నది. రంగనాయకసాగర్ కాల్వలోకి నీటిని విడుదల చేసి గ్రామ చెరువును నింపాలని ధూళిమిట్ట గ్రామస్తులు డిమాండ్ చేస్తున్నారు.

### మూడున్నర ఎకరాల్లో పంట ఎండింది



నేను ఈ యాసంగిలో ఐదెకరాల్లో వరి పంట వేసిన. బోర్లల్ల నీళ్లు లేక మూడున్నర ఎకరాల్లో వరి పంట పూర్తిగా ఎండిపోయింది. ఎండిన వరి పంటను పశువుల మేత కోసం విడిచిపెట్టిన. ఉన్న ఎకరంన్నర కూడా పారేతట్టు లేదు. పొలం ఎండిపోవడంతో రూ. 2లక్షల నష్టం వాటిల్లింది. ప్రభుత్వం ఎండిన పంటకు నష్టపరిహారం ఇచ్చి ఆదుకోవాలి.

– గుజ్జుల మల్లారెడ్డి, రైతు, ధూళిమిట్ట

## ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డితోనే అభివృద్ధి సాధ్యం


ఆకునూరులో సీసీ రోడ్డు నిర్మాణ పనులను ప్రారంభిస్తున్న ఏఎంసీ మాజీ చైర్మన్ సుంకరి మల్లేశం తదితరులు


రాంపూర్‌లో సీసీ రోడ్డు పనులను ప్రారంభించిన దినేశ్‌తివారీ

చేర్యాల, మార్చి 24 : పల్లెల అభివృద్ధి ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డితో సాధ్యమవుతుందని చేర్యాల వ్యవసాయ మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ సుంకరి మల్లేశంగౌడ్ అన్నారు.మండలంలోని ఆకునూరులో సీసీ రోడ్డు నిర్మించేందుకు ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి మంజూరు చేయించిన రూ.5లక్షలతో చేపట్టే నిర్మాణ పనులను సోమవారం బీఆర్‌ఎస్ గ్రామశాఖ అధ్యక్షుడు పాల బాలరాజుతో కలిసి ఆయన ప్రారంభించారు.ఈ సందర్భంగా మాట్లాడుతూ మండలంలోని అన్ని గ్రామాల్లో సీసీ రోడ్లు, డ్రైనేజీలు నిర్మించేందుకు ఎమ్మెల్యే రూ.కోటి60లక్షలు మంజూరు చేయించినట్లు తెలిపారు.కార్యక్రమంలో బీఆర్‌ఎస్ మండల ప్రధాన కార్యదర్శి కోతి దాసు, గ్రామ ఉపాధ్యక్షుడు శనిగరం రమేశ్, సీనియర్ నాయకులు వంగాల శ్రీకాంత్‌రెడ్డి, మంతపురి సత్యనారాయణ గౌడ్, మాజీ వార్డు సభ్యుడు రణం ప్రశాంత్, సోషల్ మీడియా గ్రామ అధ్యక్షుడు ముచ్చాల వంశీ, నాయకులు తోళ్ల సత్యం, కోతి యేబు, కంతుల రాజు, ఎండీ అక్బర్, తౌట విజయ్ కుమార్, చిగుళ్ల బాలరాజు, పోషయ్య, హరికృష్ణ పాల్గొన్నారు.

### సీసీ రోడ్డు పనులు ప్రారంభం

మండలంలోని రాంపూర్ గ్రామం అభివృద్ధి కోసం ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి మంజూరు చేయించిన రూ.4లక్షలతో నిర్మించే సీసీ రోడ్డు పనులను సోమవారం గ్రామ మాజీ సర్పంచ్ దినేశ్‌తివారీ ప్రారంభించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి గ్రామాల అభివృద్ధి కోసం నిరంతరం కృషి చేస్తున్నాడన్నారు. ప్రతిపక్షంలో అన్నివర్గాల సంక్షేమం, అభివృద్ధే ధ్యేయంగా ముందుకు సాగుతున్న ఎమ్మెల్యేకు ప్రజలు అండగా ఉండాలన్నారు. బీఆర్‌ఎస్ గ్రామశాఖ అధ్యక్షుడు కిష్టయ్య, నాయకులు బండారి శ్రీశైలం, దొడ్డి వెంకటయ్య, రాజయ్య,సిద్ధయ్య పాల్గొన్నారు.

## అ 'పూర్వ' సమ్మేళనం

మిరుదొడ్డి, మార్చి 24 : మండల కేంద్రంలో సోమవారం 1981–82 విద్యా సంవత్సరంలో టెన్త్ పూర్తిచేసిన పూర్వ విద్యార్థులు సమ్మేళనం జరుపుకొన్నారు. ఈ సందర్భంగా చిన్ననాటి జ్ఞాపకాలను గుర్తుచేసుకొని అప్పటి గురువులకు శాలువాలు కప్పి సన్మానించి శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో పూర్వ విద్యార్థులు పాల్గొన్నారు.


మిరుదొడ్డి: సమ్మేళనంలో పాల్గొన్న పూర్వ విద్యార్థులు, ఉపాధ్యాయులు


## అనుమానాస్పద స్థితిలో యువకుడి మృతి

దుబ్బాక, మార్చి 24: అనుమానాస్పద స్థితిలో యువకుడు మృతి చెందాడు. దుబ్బాక శివారులోని ఎల్లమ్మ దేవాలయ సమీపంలో ఓ చెట్టు వద్ద యువకుడి మృతదేహం ఉండటం చూసిన స్థానికులు పోలీసులకు సమాచారం ఇచ్చారు. మృతుడు దుబ్బాకకు చెందిన మంచె అఖిల్(26)గా గుర్తించారు. అఖిల్ మృతిపై కుటుంబీకులు పలు అనుమానాలు వ్యక్తం చేశారు. ఆదివారం అఖిల్ తన మిత్రులతో కలిసి మద్యం తాగినట్లు సమాచారం. ఆరోజు రాత్రి వరకు అఖిల్ ఇంటికి తిరిగి రాలేదు. తల్లిదండ్రులు అతడికి ఫోన్ చేసినా సమాధానం ఇవ్వలేదు. సోమవారం దుబ్బాక శివారులో అఖిల్ మృతదేహాన్ని చూసిన తల్లిదండ్రులు కన్నీరు మున్నీరయ్యారు. అఖిల్‌కు చెందిన సెల్‌ఫోన్ అతడి మిత్రుడు చౌదర్‌పల్లికి చెందిన వడ్డె సంతోష్ వద్ద ఉండటంతో పాటు అఖిల్ నోటి నుంచి నురగలు రావడంతో పలు అనుమానాలు వ్యక్తం చేశారు. తమ కొడుకును హత్య చేసి ఉంటారని మృతుడి తల్లిదండ్రులు జమున,నర్సింహులు ఆరోపించారు. మృతుడి తండ్రి నర్సింహులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి మృతదేహాన్ని పంచనామా నిమిత్తం దుబ్బాక సర్కారు దవాఖానకు తరలించి విచారణ చేపట్టినట్లు ఎస్సై గంగరాజు తెలిపారు.


దుబ్బాక శివారులో అనుమానాస్పద స్థితిలో మంచె అఖిల్ మృతదేహం

## హుస్నాబాద్‌లో నార్కోటిక్స్ డాగ్స్ తనిఖీలు

హుస్నాబాద్‌టౌన్, మార్చి 24: పట్టణంలోని పలు షాపులు, కిరాణా దుకాణాలు, బేకరీల్లో సోమవారం నార్కోటిక్స్ డాగ్స్‌తో డ్రగ్స్, గంజాయి, ఇతర మత్తు పదార్థాల కోసం తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్సై మహేశ్ మాట్లాడుతూ యువత మత్తు, డ్రగ్స్ బానిస అవుతున్నారని, ఎవరైనా మత్తు పదార్థాలు విక్రయిస్తే తమకు సమాచారం ఇవ్వాలన్నారు. షాపుల్లో విక్రయించినా చర్యలు తీసుకుంటామన్నారు.


హుస్నాబాద్‌లో పాన్‌షాపు వద్ద తనిఖీ చేస్తున్న పోలీసులు

## పారిశుధ్య పనులు చేయించాలి

హుస్నాబాద్‌టౌన్, మార్చి 24: హుస్నాబాద్ మున్సిపల్ కార్యాలయంలోని వివిధ విభాగాల్లో పనిచేస్తున్న పారిశుధ్య కార్మికులను తక్షణమే ఆయా పనుల నుంచి తొలిగించి పారిశుధ్య పనులు చేయించాలని భారతీయ కిసాన్ సంఘ డివిజన్ ఇన్‌చార్జి కవ్వ వేణుగోపాల్‌రెడ్డి కమిషనర్‌ను కోరారు. మున్సిపల్‌లో 120మంది పారిశుధ్య కార్మికులు ఉండగా పారిశుధ్య పనుల్లో 80 మంది మాత్రమే పాల్గొంటున్నారని, మిగతా సిబ్బంది కార్యాలయంలో పనిచేస్తున్నారని ఆరోపించారు. సిబ్బందిని పూర్తిస్థాయిలో కేటాయించకపోవడంతో పారిశుధ్య పనులు జరగడం లేదన్నారు. ఇంజినీరింగ్‌శాఖలో వర్క్ ఇన్‌స్పెక్టర్‌ను నియమించకుండా పారిశుధ్య కార్మికుడిని నియమించారన్నారు.

# దరఖాస్తులు సత్వరమే పరిష్కరించాలి


దరఖాస్తులు స్వీకరిస్తున్న కలెక్టర్ మనుచౌదరి

సిద్దిపేట అర్బన్, మార్చి 24 : ప్రజావాణిలో స్వీకరించిన దరఖాస్తులను సత్వరమే పరిష్కరించేందుకు అధికారులు చర్యలు చేపట్టాలని కలెక్టర్ మనుచౌదరి ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్‌లో ప్రజావాణిలో భాగంగా జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన ప్రజల నుంచి అదనపు కలెక్టర్లు గరిమా అగర్వాల్, అబ్దుల్ హమీద్‌తో కలిసి కలెక్టర్ వినతులు స్వీకరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. ప్రజలు ప్రజావాణి కార్యక్రమం ద్వారా అందజేసిన ఫిర్యాదులను క్షుణ్ణంగా పరిశీలించి అర్హతల మేరకు వెంటనే పరిష్కరించే దిశగా అధికారులు కృషి చేయాలన్నారు. జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన ప్రజల నుంచి మొత్తం 71 దరఖాస్తులు స్వీకరించినట్లు అధికారులు వెల్లడించారు. డీఆర్డీవో జయదేవ్ ఆర్యా, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

## యాంటీ డ్రగ్స్ సోల్జర్స్ సేవలు వినియోగించుకోవాలి

### సిద్దిపేట సీపీ అనురాధ

సిద్దిపేట అర్బన్, మార్చి 24 : గంజాయి, ఇతర మత్తు పదార్థాల రహిత జిల్లాగా చేయడానికి ప్రతి ఒక్కరూ సహకరించాలని సిద్దిపేట సీపీ బి.అనురాధ సూచించారు. తెలంగాణ నార్కోటిక్ డ్రగ్ యాంటీ నార్కోటిక్ సోల్జర్‌గా ఎంపికై శిక్షణ పూర్తి చేసుకున్న మంద జనార్దన్, వడ్ల శ్రీనివాస్ సోమవారం సిద్దిపేట సీపీ కార్యాలయంలో సీపీ అనురాధను మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా సీపీ మాట్లాడుతూ.. స్కూళ్లు, కాలేజీలు, ఇతర మాస్ ప్రదేశాల్లో అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలన్నారు. గంజాయి ఇతర మత్తు పదార్థాల రహిత జిల్లాగా చేయడానికి ప్రజలు, ప్రజాప్రతినిధుల భాగస్వామ్యం చాలా ముఖ్యమని తెలిపారు. గంజాయి ఇతర పదార్థాలు కలిగి ఉన్నా, విక్రయించినా వెంటనే డయల్ 100 లేదా పోలీస్ కంట్రోల్ రూమ్ నెంబర్ సెల్: 8712667100 నంబర్‌కు సమాచారం ఇవ్వాలన్నారు.


యాంటీ నార్కోటిక్ సోల్జర్స్‌గా శిక్షణ పొందిన వారితో సీపీ అనురాధ

### బెట్టింగ్‌లకు పాల్పడితే చట్టపరమైన చర్యలు

బెట్టింగ్‌లకు పాల్పడితే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని సిద్దిపేట పోలీస్ కమిషనర్ బి.అనురాధ ప్రకటనలో సూచించారు. ప్రస్తుతం నడుస్తున్న ఐపీఎల్ టోర్నమెంట్‌లో చాలామంది యువత సులభంగా డబ్బు సంపాదించడం కోసం క్రికెట్ బెట్టింగ్‌లకు పాల్పడుతున్నారని, క్రికెట్ బెట్టింగ్ వల్ల యువత ఆర్థికంగా దెబ్బతిని చివరికి ఆత్మహత్యలు చేసుకొని ప్రాణాలు కోల్పోయే అవకాశం ఉందన్నారు. యువత అలాంటి వాటికి దూరంగా ఉండాలని సూచించారు. ఇంట్లో తల్లిదండ్రులు తమ పిల్లలపై ప్రవర్తన నిఘా ఏర్పాటు చేయాలని సూచించారు. క్రికెట్ బెట్టింగ్, ప్లేయింగ్ కార్డ్స్, బెట్టింగ్ యాప్స్ ఇలా ఎవరైనా అసాంఘిక కార్యక్రమాలు నిర్వహిస్తే వెంటనే డయల్ 100 లేదా పోలీస్ కంట్రోల్ రూమ్ నెంబర్ సెల్: 8712667100 కు సమాచారం అందించాలన్నారు.

## బస్టాండ్ నిర్మాణ పనులకు భూమి పూజ

చేర్యాల, మార్చి 24 : మండలంలోని ఆకునూరులో లయన్స్‌క్లబ్ ఆధ్వర్యంలో గ్రామానికి చెందిన ఆకుల రమేశ్‌గౌడ్ సొంత డబ్బులు రూ.3లక్షలతో నిర్మించే బస్టాండ్ నిర్మాణ పనులకు సోమవారం భూమి పూజ చేశారు.ఈ సందర్భంగా ఆకుల రమేశ్‌గౌడ్ మాట్లాడుతూ స్వగ్రామంలో బస్టాండ్ లేక గ్రామస్తులు తీవ్ర ఇబ్బందులు పడుతున్న విషయాన్ని గమనించి బస్టాండ్ నిర్మాణానికి శ్రీకారం చుట్టినట్లు తెలిపారు.రానున్న రోజుల్లో గ్రామంలో లయన్స్‌క్లబ్ ఆధ్వర్యంలో మరిన్ని సామాజిక సేవా కార్యక్రమాలు చేపట్టనున్నట్లు తెలిపారు. లయన్స్‌క్లబ్ ప్రతినిధులు ముస్త్యాల బాల్‌నర్సయ్య, డాక్టర్ శ్రీనివాస్, డాక్టర్ దీపాంజలి, డాక్టర్ సత్యనారాయణ, కొక్కుల సురేందర్, గ్రామ నాయకులు బోయిని రాజు, కర్రెడ్ల మాధవరెడ్డి, వెలగల రఘువీర్, టీవీ.నారాయణ, తాటికొండ రాములు,పాల బాలరాజు, అందె నానిబాబు,అందె అశోక్, స్వర్గం ఉపేందర్, తోళ్ల సత్యం, బోయిని బాలయ్య, మంతపురి లక్ష్మణ్, పొడాల హరికృష్ణ పాల్గొన్నారు.


బస్టాండ్ నిర్మాణ పనులు ప్రారంభిస్తున్న లయన్స్‌క్లబ్ ప్రతినిధులు

## పేద వధువుకు పుస్తె మట్టెలు అందజేత

తొగుట, మార్చి 24: మండలంలోని ఎల్లారెడ్డిపేట గ్రామానికి చెందిన అంబికల శ్యామల గజేంద్ర దంపతుల కూతురు రుచిత వివాహానికి మాజీ ఎంపీపీటీ వేల్పుల స్వామి పుస్తె మట్టెలు సోమవారం అందజేశారు. కార్యక్రమంలో గ్రామ యువకులు ప్రభాకర్‌రెడ్డి, ఎల్లాగౌడ్, కిషన్,రాము తదితరులు పాల్గొన్నారు


పుస్తె మట్టెలు అందజేస్తున్న మాజీ ఎంపీటీసీ వేల్పుల స్వామి

## సిద్దిపేటలో మందుబాబులకు జరిమానా

సిద్దిపేట టౌన్,మార్చి 24 : మద్యం తాగి వాహనాలు నడిపిన మందు బాబులకు సిద్దిపేట న్యాయస్థానం జరిమానా విధించింది. ట్రాఫిక్ సీఐ ప్రవీణ్‌కుమార్ సోమవారం వివరాలు వెల్లడించారు.ట్రాఫిక్ సర్కిల్ పరిధిలో పోలీస్ సిబ్బందితో కలిసి వాహనాల తనిఖీ నిర్వహించగా మద్యం తాగి వాహనాలు నడుపుతున్న 10 మంది మందుబాబులను పట్టుకున్నామన్నారు. ఈ మేరకు మందు బాబులను న్యాయమూర్తి కాంతారావు ఎదుట హాజరుపర్చగా వాహనదారులకు రూ.13వేల జరిమానా విధిస్తూ తీర్పు ఇచ్చారన్నారు.

## రేపు పశువుల అంగడి వేలం

హుస్నాబాద్‌టౌన్, మార్చి 24: హుస్నాబాద్ పశువుల అంగడివేలం పాట ఈనెల 26వతేదీన నిర్వహించనున్నట్లు మున్సిపల్ కమిషనర్ టి. మల్లికార్జున్‌గౌడ్ ప్రకటనలో తెలిపారు. వేలంపాటలో పాల్గొనే వారు ఈనెల 25వ తేదీ సాయంత్రం ఐదు గంటల వరకు కార్యాలయంలో రూ.పదిలక్షల డిపాజిట్‌తోపాటు ఐదువేల రూపాయల ఫీజు చెల్లించాలని ఆయన కోరారు. 26వతేదీన ఉదయం 11గంటలకు పశువుల అంగడి వేలంపాట నిర్వహిస్తామని ఆయన తెలిపారు.

## ఆరోగ్య సంరక్షణపై అవగాహన

గజ్వేల్, మార్చి 24: గజ్వేల్ ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాలలో సోమవారం ఎన్‌ఎస్‌ఎస్ ఆధ్వర్యంలో ఆరోగ్య సంరక్షణపై విద్యార్థులకు ప్రముఖ వైద్యుడు డాక్టర్ నరేశ్‌బాబు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ పౌష్టికాహారం తీసుకుంటే ఎలాంటి జబ్బులు రావన్నారు. ఆరోగ్యం పట్ల ప్రతి ఒక్కరూ జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. వైద్యులు సునీత్‌కుమార్, సమీక్ష, కళాశాల అధ్యాపకులు పాల్గొన్నారు.

## సన్నబియ్యం పంపిణీపై సమీక్ష

మద్దూరు(ధూళిమిట్ట), మార్చి24: ఉగాది నుంచి ప్రభుత్వం చేపట్టనున్న సన్న బియ్యం పంపిణీపై మద్దూరు, ధూళిమిట్ట తహసీల్ కార్యాలయాల్లో తహసీల్దార్లు ఏజీ రహీం, సింహాచలం మధుసూదన్ సమీక్షించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఏప్రిల్‌లో రేషన్‌కార్డు కలిగిఉన్న లబ్ధిదారులకు విధిగా సన్న బియ్యం మాత్రమే పంపిణీ చేయాలన్నారు. దొడ్డు బియ్యం పంపిణీ చేయరాదని, ప్రభుత్వ నిబంధనలు ఉల్లంఘిస్తే చర్యలు తప్పవన్నారు. సమీక్షలో ఆర్‌ఐలు రమేశ్, రవీందర్, అన్వర్, రేషన్ డీలర్లు పాల్గొన్నారు.

## చేర్యాల మండలంలోకి అర్జునపట్ల, కమలాయపల్లి

చేర్యాల, మార్చి 24 : దశాబ్దాలుగా చేర్యాల మండలంలో తమను విలీనం చేయాలని కోరుతున్నప్పటికీ పాలకులు పట్టించుకోకుండా ఉన్న అర్జునపట్ల, కమలాయపల్లి గ్రామాలు ఎట్టకేలకు బీఆర్‌ఎస్ సర్కారు పాలనలో చేర్యాలలో విలీనం చేశారు. కానీ రెండు గ్రామాల పంచాయతీరాజ్‌శాఖ మాత్రం మద్దూరు మండలంలోనే కొనసాగుతున్నది.ఈ విషయాన్ని గ్రామస్తులు జనగామ ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి దృష్టికి తీసుకుపోవడంతో స్పందించిన ఆయన మంత్రి సీతక్కను కలిసి సమస్యను వివరించి రెండు గ్రామాలను చేర్యాలలో పూర్తి స్థాయిలో విలీనమయ్యేలా కృషి చేశారు.సోమవారం జరిగిన అసెంబ్లీ సమావేశంలో అర్జునపట్ల, కమలాయపల్లి గ్రామాల విలీన అంశాన్ని ఎమ్మెల్యే పల్లా అసెంబ్లీలో లేవనెత్తడంతో స్పందించిన మంత్రి సీతక్క రెండు గ్రామాలను చేర్యాల మండలంలో పూర్తిస్థాయిలో కలిపామని బిల్లులో సైతం దానిని పొందుపర్చామన్నారు. రానున్న రోజుల్లో ఎంపీటీసీ, సర్పంచ్‌లు చేర్యాల మండలంలోనే కొనసాగుతాయని ఆమె సమాధానం ఇచ్చారు.

## ఆర్టీసీని లాభాల బాటలోకి తెస్తాం

సిద్దిపేట టౌన్, మార్చి 24 : సిద్దిపేట ఆర్టీసీ డిపో మేనేజర్‌గా రఘు సోమవారం బాధ్యతలు స్వీకరించారు. ఇప్పటి వరకు ఇక్కడ పనిచేసిన సుఖేందర్‌రెడ్డి బదిలీపై పరిగి ఆర్టీసీ డిపోకు వెళ్లగా ఆయన స్థానంలో హైదరాబాద్ డిపోలో పనిచేస్తున్న రఘు సిద్దిపేట డిపోకు బదిలీపై వచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..ప్రజా రవాణా ఆర్టీసీ నమ్మకానికి మారు పేరు..అందరి సహకారంతో సిద్దిపేట ఆర్టీసీ డిపోను లాభాల బాటలోకి తెస్తామన్నారు. కార్మికులు,ఉద్యోగుల సంక్షేమమే ధ్యేయంగా పనిచేస్తామని..ప్రయాణికులకు మరింత చేరువుగా సేవలు అందిస్తామని స్పష్టం చేశారు.

## ఉద్యమాలకు సిద్ధం కావాలి

సిద్దిపేట టౌన్,మార్చి 24 : నూతన విద్యా విధానానికి వ్యతిరేకంగా విద్యార్థులు ఉద్యమించాల్సిన సమయం ఆసన్నమైందని యూఎస్‌ఎఫ్‌ఐ జిల్లా అధ్యక్షుడు రవి,ప్రధాన కార్యదర్శి మధు అన్నారు. యూజీసీకి వ్యతిరేకంగా ఢిల్లీలో ఈ నెల 27న నిర్వహించే నిరసన కార్యక్రమాలకు సిద్దిపేట నుంచి యూఎస్‌ఎఫ్‌ఐ నేతలు సోమవారం తరలివెళ్లారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ..కేంద్రం దేశ వ్యాప్తంగా విద్యను ప్రైవేటీకరణ చేసే కుట్ర చేస్తుందన్నారు. కార్యక్రమంలో నేతలు శేఖర్, ప్రవీణ్,కరుణాకర్,వికాస్ పాల్గొన్నారు.

## పంట పొలంలోకి ఆర్టీసీ బస్సు



బెజ్జంకి, మార్చి 24: మండలంలోని ముత్తన్నపేట శివారులో అదుపు తప్పి ఆర్టీసీ బస్సు పంట పొలంలోకి దూసుకువెళ్లింది. 41 మంది ప్రయాణికులతో ఆర్టీసీ బస్సు (నంబర్ టీఎస్02యుఎస్1024) కరీంనగర్ నుంచి బెజ్జంకి వస్తుండగా ముత్తన్నపేట శివారులో బస్సు స్టీరింగ్ లింక్‌రాడ్ ఊడిపోవడంతో అదుపు తప్పి పొలంలోకి దూసుకువెళ్లినట్లు డ్రైవర్ సంపత్ తెలిపాడు. ప్రయాణికులకు ఎలాంటి గాయాలు కాకపోవడంతో పెను ప్రమాదం తప్పింది. ఈ విషయం తెలుసుకున్న ఆర్టీసీ మేనేజర్ సరస్వతీ ఘటనా స్థలాన్ని పరిశీలించి వివరాలు అడిగి తెలుసుకున్నారు.